



# ఇష్టమైన పని కష్టమైనా బాగుంటుంది

**- ఎజికె (ముద్రా కృష్ణమూర్తి)**

మూర్తీభవించిన అనుభవం, మూటగట్టిన సామర్థ్యం, మడమ తిప్పని అంకిత భావం.. ఈ మూడూ కలిసి మాట్లాడితే ఎలా ఉంటుంది? అదిగో అచ్చం ఆయన మాట్లాడినట్లుం టుంది. ఓసారి మాట్లాడండి.. మీకే తెలుస్తుంది. నిండుకుండలాగా తొణకని ఆత్మవిశ్వాసం, నిబద్ధత తొణికిసలాడే ఆశావహ దృక్పథం ఆయన మాటల్లో కనిపిస్తాయి.

తనలోని బలాన్ని గుర్తెరిగి, ఎన్ని కష్టాలైనా ఎదురేగి, ఇష్టమైన రంగంలో నిష్ణాతుడిగా ఎదగాలన్న సందేశం ఆ మాట తీరులో ధ్వనిస్తుంది. యువతకు దిశానిర్దేశం చేస్తుంది.

సాధారణ కుటుంబ నేపథ్యం.. సాదాసీదా ఉద్యోగ జీవితం.. ఇంతేలే అని చింతిస్తూ కూర్చోలేదాయన. తనలోని బలమేమిటో ఆయనకి తెలుసు. దాంతో సాధించగల లక్ష్యం కూడా తెలుసు. ఆ దిశగా కదిలారు. సాహసించారు. సవాళ్లను ప్రేమించారు. కడుపులో చల్ల కదలని సర్కారీ నౌకరీ కాదని, ఎక్కడో అహ్మదాబాద్ నగరంలోని అడ్వర్టయిజింగ్ రంగంలోకి ప్రవేశించారు. ధీరూభాయ్ అంబానీలాంటి భారతీయ కార్పొరేట్ దిగ్గజంతో పని చేసి, అతి కొద్దికాలంలో తెలుగువారు గర్వించదగ్గ అత్యున్నత శిఖరాలకు చేరుకున్నారు.

1964లో 'తానొకటి తలస్తే'తో కథా రచయితగా అక్షరయాత్రను ప్రారంభించి, అడ్వర్టయిజు రంగంలో కమ్యూనికేటర్‌గా విశేషానుభవాన్ని గడించి, విజయ సూత్రాలకు విస్పష్ట భాష్యం చెబుతూ తెలుగులో పది, ఇంగ్లీషులో ఐదు స్ఫూర్తిదాయక ప్రామాణిక గ్రంథాల్ని రాసిన 'ఎజికె' పదహారు అణాల తెలుగు వ్యక్తి. ప్రచార రంగంలో ఆయన పేరు 'ముద్రా కృష్ణమూర్తి'. అచ్యుతని గోపాల కృష్ణమూర్తి 'ముద్రా' కృష్ణమూర్తిగా ఎదిగిన వైనం అత్యంత స్ఫూర్తిదాయకం.

ఆయన పేరు చెప్పగానే 'ఐ లవ్ యూ రస్నా' గుర్తుకొస్తుంది. వివియన్ రిచర్డ్స్, అలెన్ బోర్డర్, రవిశాస్త్రిలు హుందాగా నడిచిన 'విమల్' ప్రకటన చిత్రం కళ్లకు కడుతుంది. ఎజికె ఫౌండర్ ఛైర్మన్‌గా, 35 వేల రూపాయలతో, ఒకే ఒక్క క్లయింట్‌తో ఊపిరి పోసుకున్న ముద్ర కమ్యూనికేషన్స్ కేవలం తొమ్మిదేళ్లలో భారతదేశంలోని అతిపెద్ద అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో మూడవ స్థానాన్నీ, భారతీయ అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో ప్రథమ స్థానాన్నీ సంపాదించిన విశిష్ట ప్రస్థానం భళిరా అనిపిస్తుంది.

"మట్టిలోంచే కాదు, మనుషుల్లోంచి కూడా మాణిక్యాన్ని వెలికి తీయాలనేది ధీరూభాయ్ గారి తపన! ప్రతి భారతీయుడిలోనూ దాగి వున్న ప్రతిభ, పట్టుదల వంటివి అతని అంచనాలను మించినవని ధీరూభాయ్‌గారు గట్టిగా నమ్ముతారు. అందుకే అందరూ తమ శక్తి సామర్థ్యాల్ని తమంతట తాము గ్రహించేలా చేయాలన్నది ఆయన సంకల్పం. ఫలితంగా ఆయన సాగించిన ఉద్యమం నాలాంటి ఎంతో మందికి కార్పొరేట్ జీవితాన్ని ప్రసాదించింది" ఎజికె రాసిన 'ధీరూభాయిజమ్' పుస్తకానికి ముకేష్ అంబాని రాసిన తొలి పలుకుల్లోని ఈ వాక్యాల్ని చదివితే ధీరూభాయ్ వెలికి తీసిన మాణిక్యాల్లో తెలుగు ప్రముఖుడైన ఎజికె కూడా ఉన్నారనిపిస్తుంది. ఆ స్థాయికి ఎదగడానికి ఆయన చేసిన ప్రయాణం, ప్రయత్నం రెండూ గొప్పవే!

గుంటూరు జిల్లా వినుకొండలో 1942 ఏప్రిల్ 28న ఎజికె జన్మించారు. గుంటూరు, తెనాలి, బాపట్ల, మద్రాసు నగరాల్లో ఆయన విద్యాభ్యాసం సాగింది. చదువుకునే రోజుల్లో ఆయన మంచి స్పోర్ట్స్‌మన్. బొమ్మలు కూడా వేసేవారు. ఆ రోజుల్లోనే పుస్తక పఠనం అభిరుచిగా మారింది. తెలుగు సాహిత్యాన్ని బాగా చదివారు. ముఖ్యంగా పత్రికల్లో ధారావాహికల్ని తెగ చదివేవారు. హిస్టరీ ప్రధానాంశంగా ఆంధ్రాయూనివర్శిటీ నుంచి బి.ఎ. పట్టాను పొందిన తర్వాత ఎజికెకి హైదరాబాద్‌లోని పురావస్తు శాఖలో ఉద్యోగం వచ్చింది. బోలెడంత తీరిక. కడుపులో చల్ల కదలకుండా, నిమ్మకు నీరెత్తినట్లు సాగిపోయే రోజులు. ఎజికెకి అవి నచ్చలేదు. జీవితమంటే ఇది కాదనిపించింది. ఏదో సాధించాలనిపించింది. ఆ రోజుల్లోనే ఎజికె 'తానొకటి తలిస్తే' కథను రాశారు. 'ఆంధ్ర పత్రిక' వీక్లీలో అది అచ్చయింది. ఆ కథను చదివిన ఉషశ్రీ దాన్ని రేడియో నాటికగా రాశారు. ఆ ఉత్సాహంతో ఎజికె మరి కొన్ని కథలు రాశారు. హైదరాబాద్‌లోనే కొనసాగి ఉంటే ఆయన మరిన్ని కథలు రాసేవారేమో! కానీ ఆయన దృష్టి మరెక్కడో ఉంది. తనదైన భవిష్యత్తుకు తానే రూపకల్పన చేసుకోవాలన్న సంకల్పంతో ఆయన ప్రభుత్వోద్యోగాన్ని వదులుకొన్నారు. ప్రయివేటు సంస్థలో కొలువుకు సిద్ధమయ్యారు.



## జయహో...




డబ్బు సంపాదించాలంటే ఐడియాలు కావాలి. పద్ధతులు కావాలి. అడ్డదారులు కాదని యువతకు ఉద్బోధిస్తూ, గొప్ప నిజాలు ఎంతో సామాన్యమైనవనీ, గొప్ప వ్యక్తులు కూడా ఎంతో సామాన్యమైన వారేననీ తెలియజేస్తూ, విజయసాధనకు అత్యంత అవసరమైన 10 సూత్రాల్ని ఈ పుస్తకంలో విస్తృతంగా, విపులమైన ఉదాహరణలతో వివరించారు ఎజికె. కల నిజమాయెగా, ఎంచుకున్న రంగంలో నిష్ణాతులుగా మారండి, బి పాజిటివ్, అసాధ్యాలు అంటూ అసలు ఏవీ లేవు, పేరు ప్రతిష్ఠల ఫలితమే డబ్బు, కలలను గమ్యాలను విడనాడొద్దు, సహచరులే తోడు నీడ, సవాళ్లను ఆహ్వానించండి, సర్వేజనాః సుఖినోభవంతు,ఒకే జీవితం ఒకే అవకాశం పేరిట పది సూత్రాలను రూపొందించి ప్రతీ సూత్రంలోనూ అట్టడుగునుంచి అత్యున్నత స్థాయికి చేరుకొన్న దేశ, విదేశాలకు చెందిన వ్యక్తుల జీవితాలను సందర్భోచితంగా ఉటంకిస్తూ సరళమైన తెలుగులో రచయిత వివరించారు. శైలి గబగబా చదివిస్తుంది. ఇతివృత్తం ఆశావహదృక్పథానికి తెర తీసి, చదువరిలో ఉత్తేజాన్ని కలిగిస్తుంది. నిరాశా నిస్పృహల్ని తొలగించి, నిబిడీకృత శక్తుల్ని గుర్తించేలా చేస్తుంది. ఇందులో రచయిత పొందుపరచిన సూత్రాలు కేవలం ప్రవచనాల్లో, పడికట్టు సిద్ధాంతాల్లో కావు. ఆచరణ సాధ్యాలు. ఎజికె ఇంగ్లీషులో రాసిన 'టెన్ మచ్... టెన్ ఆర్డినరీ ప్రోసెసెస్ ఫర్ ఎక్స్‌ట్రార్డినరీ సక్సెస్' పుస్తకానికి ఇది తెలుగు రూపం. ఎమెస్కో ప్రచురించిన ఈ 188 పేజీల పుస్తకం ధర రూ. 90.



అవార్డు అందుకుంటూ...

## నచ్చినవి

| | |
|---|---|
| సినిమా | : మాయాబజార్ |
| నటుడు | : ఎయన్నార్ |
| పాట | : చిగురాకులలో చిలకమ్మా (దొంగరాముడు) |
| గాయకుడు | : ఘంటసాల |
| గాయని | : భానుమతి |
| నవల | : బలిపీఠం (రంగనాయకమ్మ) |
| వ్యక్తి | : ధీరూభాయ్ అంబానీ |
| రచయితలు | : కొ.కు, ముళ్లపూడి |
| పుస్తకం | : భగవద్గీత |

### ఆదరించిన అహ్మదాబాద్

1968... హైదరాబాద్ వదిలి అహ్మదాబాద్ చేరుకొన్నారు ఎజికె. అప్పట్లో పేరు మోసిన క్యాలికో మిల్స్ టెక్స్‌టైల్స్ కంపెనీలో శ్రీమతి గిరాబెన్ శరాభాయికి సహాయకుడిగా సరికొత్త జీవితానికి శ్రీకారం చుట్టారాయన. గుజరాతీలలో పట్టుదల, పరిశ్రమించే గుణం, సమయపాలన వంటి లక్షణాలు ఆయన్ని ఆకర్షించాయి. ఆలోచింపజేసి, స్ఫూర్తిని కలిగించాయి. నాలుగేళ్ల తర్వాత ఎజికెకి ఇష్టమైన రంగంలో ఉద్యోగం లభించింది. క్యాలికో మిల్స్ టెక్స్‌టైల్స్ కంపెనీ వారి అడ్వర్టయిజింగ్ ఏజెన్సీ 'శిల్పి'లో అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఆయన ప్రవేశించారు. ఎక్కడో తయారైన వస్తువు మరెక్కడో ఉన్న వినియోగదారుడికి చేరాలంటే దూరాభారాల్ని అధిగమించాలి. ఈ ప్రక్రియను వేగవంతం చేసి, ఉత్పత్తి-వినియోగాల మధ్య వారధిని నిర్మించడంలో వాణిజ్య ప్రకటనలు కీలక భూమికను పోషిస్తాయి. ఈ రంగంలో శాస్త్రంతో పాటు కళ కూడా ఉంది. అంతులేని సృజనాత్మకతతో ఆకాశమే హద్దుగా వాణిజ్య ప్రకటనల్ని రూపొందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వాటితోబాటు సవాళ్లున్నాయి.. సమస్యలున్నాయి. ఇవన్నీ ఎజికెకి తెలుసు. ఇది తనకిష్టమైన రంగం. అందుకే కష్టమైనా ఇందులోనే తన భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన నిర్ణయించుకొన్నారు.

### ధీరూభాయ్‌తో తొలి పరిచయం

ఆ రోజుల్లో విమల్ చీరెలు ప్రాచుర్యం పొందడాన్ని ఎజికె గమనించారు. ఆ కంపెనీ వాణిజ్య ప్రకటనల వ్యాపారాన్ని తమ 'శిల్పి' యాడ్ ఏజెన్సీకి తీసుకురావాలని నరోడాలో ఉన్న రిలయెన్స్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధుల్ని కలుసుకొన్నారు. వారు ఎటూ తేల్చకపోవడంతో బొంబాయిలోని ఆ సంస్థ అధినేత ధీరూభాయ్ అంబానీని కలవాలని ఎజికె తన బృందంతో వెళ్లారు. అక్కడ ఆరేడు గంటలపాటు పడిగాపులు పడ్డాక అంబానీ నుంచి పిలుపు వచ్చింది. అప్పటికే అలసట, నిరుత్సాహం ఆవరించడంతో అదేదో మొక్కుబడి తతంగం అనుకొంటూ ధీరూభాయ్ చాంబర్‌లోకి వెళ్లిన ఎజికెకి ఓ గంట తర్వాత అంబానీలో ఓ స్రష్ట, ద్రష్ట, మార్గదర్శి, స్ఫూర్తిదాత కనిపించాడు. విమల్ వాణిజ్య ప్రకటనల వ్యాపారం 'శిల్పి' కంపెనీకి రాలేదు గానీ కొన్ని వారాల తర్వాత 1976లో విమల్ సంస్థలో అడ్వర్టయిజింగ్ మేనేజర్‌గా చేరమంటూ ఎజికెకి ఆహ్వానం వచ్చింది.

### తనదైన ముద్ర

ఏ పనిచేసినా టాప్ ర్యాంక్‌లో ఉండాలని కోరుకునే ధీరూభాయ్ విమల్‌కి సొంత యాడ్ ఏజెన్సీ స్థాపించాలనుకొన్నారు. అచిరకాలంలో అది టాప్ ర్యాంక్ సాధించాలనుకొన్నారు. ఆ పనిని ఎజికెకి ఆయన అప్పగించారు. అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు ఎజికె. 'విమల్' లాగే యాడ్ ఏజెన్సీ పేరులో సైతం భారతీయ సంస్కృతి ప్రతిబింబించాలనుకొన్నారు. 'ముద్ర' అని పేరు పెట్టారు. 1980 మార్చి 25న 35 వేల రూపాయల మూలధనంతో, ఒకే ఒక్క క్లయింట్‌తో ఎజికె – ఫౌండర్, ఛైర్మన్, ఎండీగా ఊపిరి పోసుకున్న ముద్ర కమ్యూనికేషన్స్ లిమిటెడ్ కేవలం తొమ్మిదేళ్లలో అగ్రస్థాయికి చేరుకొంది. అంతర్జాతీయ సంస్థల సరసన సగర్వంగా జెండా ఎగరేసింది. విమల్ ఫ్యాబ్రిక్స్, రస్నా సాఫ్ట్ డ్రింక్ కాన్సన్‌ట్రేట్‌లను ప్రారంభ దశ నుంచి భారత దేశపు అగ్రగామి బ్రాండ్‌లుగా గుర్తింపు పొందేవరకు ఎజికె ఎంతగానో పరిశ్రమించారు. ఎన్నో ప్రచార వ్యూహాల్ని రచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా అద్భుతాలు సృష్టించారు.

### ఇంటగెలిస్తే..

సంస్థ రూపొందించిన వాణిజ్య ప్రకటనల్ని ఎజికె తమ ఇంట్లో వారికి చూపించేవారట. కుటుంబ సభ్యుల అభిప్రాయాల్ని తెలుసుకొని, వారికి నచ్చితే ప్రపంచానికి నచ్చుతుందన్న ఆత్మవిశ్వాసంతో తదుపరి వ్యూహాల్ని రూపొందించేవారట. మిన్ను విరిగి మీద పడ్డా చలించని తత్త్వాన్ని తాను ధీరూభాయ్ నుంచి అలవరచుకొన్నానని ఎజికె అంటారు. ఓ సారి ఢిల్లీ అశోకా హోటల్‌లోని కన్వెన్షన్ హాల్‌లో విమల్ ఫ్యాషన్ షోలు నిర్వహించినప్పుడు వీవీపీ స్థాయికి చెందిన జనం విరుచుకు పడిన సందర్భంలో ధీరూభాయ్ అంబానీ ఒంటిచేత్తో పరిస్థితిని నియంత్రించిన తీరు ఎజికెలో కొండంత ధైర్యాన్నీ, అంతులేని ఆత్మవిశ్వాసాన్నీ నింపింది. 1987 రిలయన్స్ కప్ (ప్రపంచ క్రికెట్ కప్) పోటీలు జరిగిన సందర్భంగా జైపూర్‌లో విమల్ సూటింగ్‌కి సంబంధించిన వాణిజ్య ప్రకటన చిత్రం తాలూకు షూటింగ్ కోసం ఎజికె ఏర్పాట్లు చేశారు. అందులో మోడల్‌గా నటించడానికి అంగీకరించిన వెస్టిండీస్ ఆటగాడు వివియన్ రిచర్డ్స్ బిజీ షెడ్యూల్‌ని దృష్టిలో ఉంచుకుని, కేవలం 4 గంటల అతి తక్కువ వ్యవధిలో షూటింగ్ ముగించి, ఆటగాడి ప్రశంసలతో బాటు అద్భుతమైన ఎఫెక్ట్‌ని రాబట్టుకొన్నారు ఎజికె! అలాంటిదే మరో



ధీరూభాయ్ అంబానీతో...

సంఘటన. ఎజికె ఓ సారి విమానంలో వెళ్తున్నారు. ఆయన పక్క సీట్లో పెద్ద వ్యాపారవేత్త ప్రయాణిస్తున్నాడు. మాటల సందర్భంలో 'ఐ లవ్ యూ రస్నా' ఎజికె సృజనేనని తెలుసుకొని ఆనందం పట్టలేక ఆ వ్యాపారవేత్త అమాంతంగా సీట్లోంచి లేచి నిలబడ్డాడు. ఎగురుతున్న విమానంలో చెయ్యెత్తి శాల్యూట్ చేశాడు.

### వెల్లువెత్తిన పురస్కారాలు

ముద్రాను అగ్రశ్రేణికి చేర్చడంతోనే ఎజికె కృషి ఆగలేదు. ధీరూభాయ్ ప్రోత్సాహంతో 1991లో ఆయన ముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్, అహ్మదాబాద్ (మైకా)ను స్థాపించారు. ఆసియాలోనే ఇది ఏకైక అడ్వర్టయిజింగ్ ఇన్‌స్టిట్యూట్. మనదేశంలోని అడ్వర్టయిజింగ్ రంగానికి అవసరమైన సుశిక్షితులైన ప్రతిభావంతులను అందించడం ఈ సంస్థ లక్ష్యం. అలాగే 1993లో ముద్ర ఇంటర్నేషనల్ ద్వారా అంతర్జాతీయన అడ్వర్టయిజింగ్ రంగంలోకి కూడా ఎజికె అడుగు పెట్టారు.

ఇరవై మూడేళ్ల వ్యవధిలో ఎజికె నేతృత్వంలో ముద్ర 844 పురస్కారాలు పొందింది. వీటిలో భారత రాష్ట్రపతి పురస్కారాలు, ఏజెన్సీ ఆఫ్‌ది ఇయర్ అవార్డ్‌ను ముద్ర గెలుచుకోవడం విశేషం. భారత అగ్రగామి మార్కెటింగ్

జర్నల్ ఎ అండ్ ఎం – 'అడ్వర్టయిజింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ఎజికె ని 1985లో సత్కరించింది. కోల్‌కతాలోని అడ్వర్టయిజింగ్ క్లబ్ తమ హాల్ఆఫ్ ఫేమ్‌లో ఎజికెకి స్థానం కల్పించింది. బ్రిటన్‌కు చెందిన 'మీడియా ఇంటర్నేషనల్' పత్రిక 1998లో అంతర్జాతీయ అడ్వర్టయిజింగ్ రంగానికి చెందిన 25 మంది కీలక ప్రముఖుల జాబితాలో ఎజికె పేరును గౌరవించింది. 'పయనీరింగ్ స్పిరిట్ అండ్ ఎంట్రప్రెన్యూరియల్ విజన్'కు గుర్తింపుగా 1999లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎఎఎఐ- ప్రేమ్ నారాయణ్ అవార్డ్ ఎజికెను వరించింది. మనదేశంలోనే తొలి 'ఆన్‌లైన్ రిఫరెన్స్ ఫర్ అడ్వర్టయిజింగ్ – మాగిండియా డాట్ కామ్'ను నెలకొల్పిన ఘనత ఎజికెదే! 'ఇంటర్నేషనల్ హూ ఈజ్ హూ ఆఫ్ ప్రొఫెషనల్స్' 2002-03 ఎడిషన్‌లో ఎజికెకి స్థానం లభించింది. జీవితంలో ఘనవిజయాలు సాధించిన తెలుగు ప్రముఖుడిగా 2003లో మాటీవీ సత్కారాన్ని అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ద్వారా ఎజికె అందుకొన్నారు. ముద్ర నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత 'ఎజికె బ్రాండ్ కన్సల్టింగ్'కు ఆయన ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. ఓ కుమారుడు.

### *ఆయన శైలి.. అడ్వర్టయిజింగ్ శైలి*

కథా రచయితగా ఆరంభించి వాణిజ్య ప్రచార రంగంలో నిష్ణాతుడిగా ఎదిగిన వైనాన్ని వివరిస్తూ "కథకుడు తన కోణం లోంచి రచన చేస్తాడు. చదివే వారందర్నీ అది ఆకట్టుకోవాలన్న నియమం లేదు. కానీ అడ్వర్టయిజింగ్ రంగంలో క్రియేటర్ బాధ్యత వేరు. అతనో కమ్యూనికేటర్‌గా మారిపోవాలి. తన సృజన ప్రతీ వ్యక్తికీ చేరాలి. బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించగలగాలి" అంటారు ఎజికె. నేటి యువతకు దిశానిర్దేశం కరువై పోయిందన్న ఆవేదన ఆయన మాటల్లో వ్యక్తమవుతుంది. మనదేశ యువతలో అపారమైన శక్తి సామర్థ్యాలున్నాయనీ, ధీరూభాయ్ లాంటి ఉన్నత వ్యక్తుల జీవితాలనుంచి వారు స్ఫూర్తిని పొందితే భారత్ అగ్రగామిగా వెలుగొందడం ఖాయమని ఎజికె దృఢ విశ్వాసం. స్వశక్తినీ, ప్రతిభనూ గుర్తించి రాణించగల రంగంలో కృషి చేస్తే కష్టమైన పనికూడా ఇష్టంగా ఉంటుందంటారు ఎజికె. ఏదో ఆషామాషీగా కాకుండా అంకితభావంతో చేసిన పనిలో ఆనందం పొందే వ్యక్తులు వయసును జయిస్తారనీ, ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా కానవస్తారనీ అంటారాయన. ఇందుకు ఉదాహరణగా రవిశంకర్, లతామంగేష్కర్, ఏయన్నార్, ఎమ్ఎఫ్ హుసేన్, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం లాంటి వ్యక్తుల్ని ఆయన పేర్కొంటారు. కలలుగంటూ వ్యూహాత్మకంగా అల్లుకు పోయేవాడికి అగ్రస్థానాలు కైవసమవుతాయనీ, విజయాలు దాసోహమంటాయనీ ఎజికె చెబుతున్నప్పుడు వాతావరణంలో చైతన్యం వెల్లివిరుస్తుంది. అందరూ ఒకేలాంటి అద్భుతాల్ని సాధించాలన్న నియమం లేదు. 'నీకు ఎలుకల బోను తయారు చెయ్యడం వస్తే అందరికన్నా మెరుగైన బోను తయారు చెయ్యి' అనే ఎమర్సన్ సూక్తిని యువత గుర్తుంచుకోవాలని అంటారు ఎజికె. ఓ గమ్యం.. అందుకో వ్యూహం.. దానికో పద్ధతి.. గురి తప్పని ఆచరణ – విజయ సాధనకు ఇవి నాలుగు స్తంభాలని చెబుతున్న ఎజికె ప్రస్తుతం అడ్వర్టయిజింగ్ రంగంలో ప్రాక్టికల్ స్టడీతో కూడిన 'ప్రొఫెషనల్ గైడ్' పాఠ్యగ్రంథాన్ని రాస్తున్నారు. తెలుగుదనాన్నీ, భారతీయతనూ ప్రేమించే ఈ సృజన శీలికి 'భగవద్గీత' నిత్య పఠన గ్రంథం కూడా. బాలకృష్ణప్రసాద్ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు హాయిగా వినడం ఎంతో ఇష్టం.

*–ఓలేటి శ్రీనివాస భాను*

# కవి పండితులు – కయ్యాలు వియ్యాలు




కొండవీటి వెంకటకవి అంతటి వాడికే గురువు తాతా సుబ్బరాయశాస్త్రి. వ్యాకరణ పండితుల్లో ప్రముఖులంతా వారికొచ్చిన అనుమానాలను తొలగించుకోడానికి విజయనగరానికి, తాతా సుబ్బరాయశాస్త్రి దగ్గరికొచ్చే వారు.


ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రథమ వైస్‌ఛాన్సలర్ డా. కట్టమంచి రామ లింగారెడ్డి, ఆయనకు 'కళాప్రపూర్ణ' 'గౌరవ డాక్టరేట్' ఇవ్వాలని ఆయనే స్వయంగా కారులో తాతా సుబ్బరాయశాస్త్రిగారింటి కొచ్చారు.

అప్పుడాయన కొందరు శిష్యులతో వ్యాకరణాంశాలు చర్చిస్తున్నారు. కట్టమంచి వారు నమస్కరించి 'తమను కళాప్రపూర్ణ బిరుదుతో సత్క రిస్తాము' అంగీకరించాలి అన్నారు.

"నీవు ఇంత చదువుకున్నా – 'కళాప్రపూర్ణ అంటే' అర్థం తెలియకుండా పోయింది! వద్దులే!' అని తేలిగ్గా నవ్వేశారట.

అంత గొప్ప పండితుడికి, తాను 'కళాప్రపూర్ణ'లో బిరుదుకి తగనని పించింది.

***




విశ్వనాథ సత్యన్నారాయణగారు ముక్కుకు సూటిగా పోయే మనిషి.

ఎవ్వరినీ లెక్కచేసే అలవాటు ఆయనకు లేదు. కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా చేసిన సాహితీవేత్త డా. బెజవాడ గోపాలరెడ్డి గారు స్వయంగా 'మీ రచన ఏదోవొకటి నాకు అంకితం తీసుకుందామని వుంది!" అన్నారు. ఆయన ఎన్నో ఏళ్ళు, కోరగా, కోరగా, సాహితీ అకాడమి బహుమతి వచ్చిన 'మధ్యాక్కరలు, ఆయనకు అంకితం ఇవ్వమని కోరుతున్నారు. ఎలాను మంత్రి పదవి పోయాక ఇస్తానన్నా నని, ఇప్పుడు మీరు – మంత్రికాదు! కేవలం సాహితీవేత్త, సాహిత్యాభి మాని! అందుకే నా 'మధ్యాక్కరలు, ఈయనకు అంకితం ఇస్తున్నాను!" అన్నారు.

మంత్రి పదవిలో ఉన్నవారికి, అంకితం ఇస్తే "ఏదో ప్రలోభంతో ఇచ్చి వుంటారు!" అనే అపవాదు పడటం ఆయనకు ఇష్టం లేదు!

అందుకే ఆయన కవి సామ్రాట్ అయ్యారు.

***




కేవలం తన పాటల ప్రతిభతో ఎన్నో తెలుగుచిత్రాలు హిట్ కావటానికి కారణం అయ్యారు – ఆచార్య ఆత్రేయ!.

అయితే "ఆయన రాయక నిర్మాతల్ని – వ్రాసి ప్రేక్షకుల్ని ఏడ్పిస్తారు!" అనే అపప్రథ వుంది.

ఇదే విషయం ఆయనను అడిగితే ఒక సభలో "బాగా వ్రాయడానికి నేనెంతో మదనపడతానో, ఎంత ఏడుస్తానో మీకెవరికీ తెలియదు!" అన్నారు.

ఆయన సొంత చిత్రం, ఆయన డైరెక్ట్ చేసుకున్నా 'పాటలు, సకాలంలో వ్రాయలేక పోయారట!'

***

వేదం వేంకట శాస్త్రిగారొకసారి డిగ్రీ పరీక్ష వ్రాశారు.

తెలుగులో, ఆయన ఒక ప్రశ్నకు – మూడు గంటలు సమాధానం వ్రాశారు.

ఒక్క ప్రశ్నే మూడుగంటలు సమాధానం వ్రాయటం వల్ల, ఆయన తక్కిన ప్రశ్నలు వ్రాయలేక పోవటంతో, పరీక్ష తప్పారు.

సి.ఆర్.రెడ్డిగారు, వైస్ ఛాన్సలర్‌గా వుండగా ఆంధ్రా యూనివర్సిటీకి వచ్చి "నా గ్రంథాలే మీ విద్యార్థులకు పాఠ్యగ్రంథాలుగా వున్నాయి! కాని నేను పరీక్ష వ్రాస్తే మాత్రం 'టైం' సరిపెట్టుకోలేక, పరీక్ష తప్పుతాను! ఎలా? పోనీ యూనివర్శిటీ ఒక సర్టిఫికేట్ ఇవ్వలేదా?" అన్నారు.

సి.ఆర్.రెడ్డిగారు నవ్వి, డిగ్రీ లేకపోయినా, మహాకవి, పండిత, వేదం వెంకట శాస్త్రిగారి పేరు సిండికేట్‌లో పెట్టించి ఆయనకు 'గౌరవ డాక్టరేట్, బిరుదు 'కళాప్రపూర్ణ' ఇప్పించారు.

"ఆయనకోసమే గౌరవ డాక్టరేట్' –పుట్టింది అంటారు అభిమానులు.

*–సేకరణ: ఎం.డి.సౌజన్య*

ఎ.జి.కె.కు నచ్చిన కథ

# కానుక

- ముళ్ళపూడి వెంకటరమణ

**ప్రొద్దు వాటారినప్పటి నుంచి మర్రిచెట్లలోంచి ఊడలు ఊడలుగా దిగజారుతున్న చీకటి, చలమై చెరువై చెలరేగిన యమునై సముద్రమై భూమినంతా ముంచేసింది. ఆకాశమెత్తున ముంచేసింది - రాధ కంటి కాటుకలా - కృష్ణుడి వంటి నలుపులా - నందుడి ఇంటి చల్లలా చిక్కబడింది.**

**చెట్టుకింద చీకటిమధ్య చితుకుల మంటలు కృష్ణుడిమీది ఎర్ర పట్టుకుండువాలా కదలాడుతున్నాయి. చీకటి చిక్కదనాన్ని, చక్కదనాన్ని వెలుగెత్తి చాటుతున్నాయి. మంటలో ఊచ కాలుస్తున్న గోపన్న ముఖం మీద - అతనిపక్కన చెల్లాచెదురుగా పడివున్న వేణువుల మీద, కొంచెం అవతలగా బొత్తికట్టి వున్న వెదుళ్ళమీద వెలుగు నీడల భాషతో కావ్యాలు రాస్తున్నాయి.**

ఇంక మూడు ఝాములు పోతే సప్తమి తెల్లవారుతుంది. కృష్ణుడి పుట్టిన రోజు వచ్చేస్తుంది. పాతిక పండగల నాడు గోపన్న ఆరంభించిన వేణు నిర్మాణం ఇంకా తెమలలేదు. రేపటికైనా సాధించి, తన వేణువును ఆయనకు సమర్పించాలి. రేపివ్వలేకపోతే ఇంక ఈ జన్మకివ్వలేడు. వేళయిపోయింది....

''నాయనా, బువ్వదినవే'' అన్నాడు చిన్న గోపన్న వచ్చి, గోపన్నకీ మాట వినపడ లేదు. అతని హృదయం బృందావనిలో ఉంది. అక్కడకు కృష్ణుడు వస్తాడు. వచ్చే వేళయింది. అప్పుడే గోపికల అందెల రవళి వినిపిస్తోంది. గాజుల గలగలలు, నవ్వుల కిలకిలలు వినిపిస్తున్నాయి. ఇవతల వెదురు పొదలు సన్నగా ఈలవేస్తున్నాయి. ఈ ఉపశ్రుతులన్నిటినీ కలుపుకొని కొద్ది క్షణాలలో మోహన మురళీ రవళి వినవస్తోంది.

గోపన్న ఎన్ని యుగాలుగా అక్కడ చెట్లమాటున కూర్చున్నాడో అతనికే తెలియదు. ఆకులలో ఆకై, పువ్వుల్లో పువ్వయి, ఇసుకలో రేణువై, యమునలో బిందువై, స్తంబ్దంగా కూర్చుని కృష్ణ వంశీనాదాన్ని హృదయంలో పోసుకున్నాడు. పరిశుద్ధమైన స్వరాలలో ఒక్కొక్క స్వరాన్ని మనసులో నిలుపుకొని దాని విశ్వరూపం దర్శించడానికి తపస్సు చేశాడు. అదే మనసులో పదిలంగా దాచుకుని పరుగున తన కుటీరానికి వచ్చాడు. కొత్త వెదురుకోసి స్వరద్వారాలు వేసి, మనసులో స్వరాన్ని ఇందులో పలికించబోయాడు. అస్వరం తన ఈ వేణువులో పలికితే ఇది కృష్ణయ్యకు కానుక ఇవ్వాలి. కాని అది పలకలేదు. పలికించాలని అతను ఎన్నివేల వేణువులో చేశాడు. తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలన్నీ వేణువును శ్రుతి చేయడానికే ఉపయోగించాడు. జీవి కాలమే తక్కువ. ఒక జీవితానికి లెక్కతేలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కొన్ని కోట్లు ఉంటాయి. వాటిని వృధాచేస్తే ఎలా? యమున ఒడ్డున పొదలమాటున దాగి కూర్చుని కృష్ణుడి మురళి విన్నాడు. అతను వూపిరి బిగపట్టుకునే కాలం గడిపేవాడు. అక్కడ పొదుపు చేసిన దానిని తన కొత్త వేణువును పూరించడానికి ఉపయోగించే వాడు. తీరా పూరించేసరికి అది శ్రుతిశుద్ధంగా వినబడేది కాదు. పైగా జీరబోయేది. లోపలేవన్నా ఈనెలు లేచాయేమోనని గోపన్న ఎంతో శ్రద్ధగా లోపల కూడా నునుపు చేసేవాడు. ఒకటి పట్టుకు వెళదాం అని లేచేసరికి దాని గొంతుక జీరపోయేది.

గోపన్న పూర్వం ఎన్నో వేణువులు చేశాడు. తృప్తిగా వాయించాడు. బాగానే ఉందనుకున్నాడు. కాని ఒకస్థాయి వచ్చాక అతనికొక ఊహ పోయింది. వేణువును కిందపెట్టి, సంగీతాన్ని ఊహించబోయాడు. ఊహించిన సంగీతాన్ని భావనచేసి, భావించినదానిని అనుభవించి దర్శించేసరికి అతనికొక సత్యం తోచింది. సంగీతాన్ని అనుభూతికి తెచ్చుకోవడానికి జంత్ర గాత్రాలను ఉపయోగించబోవడం అవివేకం. జలపాతాన్ని వెదురు గొట్టంలో ఇమడ్చడం పొరపాటు. సముద్రాన్ని పాలకడలిలో ఇమడ్చడం తెలివితక్కువ. ఊహకందే సంగీతంలో పాటకందేది శత సహస్రాంశం ఉండదు.

ఊహ సాగినకొద్దీ స్వరలత దిగంతాల వరకు వ్యాపించసాగింది. ఆకాశం వరకు వ్యాపించసాగింది. రోదసి అంతా నిండిపోసాగింది. క్రమంగా, ఓంకార జనితమైన స్వరార్ణవం తిరిగి ఓంకారమై భువన సమ్మోహనంగా భీకరంగా అద్భుతంగా ఎరుకపడ సాగింది. శృత సంగీతంలా ఇందులో అపశ్రుతులు లేవు. అపశబ్దాలు లేవు. అన్ని వేదాంతాలు, అన్ని సత్యాలూ అర్థసత్యాలేనంటూ, తనలో భాగాలేనంటూ నిలిచే అద్వైత సత్యంలా ఈ సంగీతంలో అపస్వరాలు కూడా అర్ధస్వరాల, పూర్ణస్వరాల పక్కన నిలిచి, అందాలు సంతరించుకుని, అందంగా భాసించసాగాయి. ప్రతి అణువునా భగవంతుడున్నాడు. ప్రతి శబ్దంలోను సంగీతం ఉంది అన్న వాక్యాల తాత్పర్యం అతనికి ఎరుకపడింది. గోపన్న అర్భక దేహానికిది దుర్భరమైపోయింది. అతను ఊహించిన సంగీతాన్ని అనుభవించడానికి శక్తి చాలలేదు. అవయవాలన్నీ విలవిలలాడే హృదయం బద్దలయిపోయే స్థితికి వచ్చింది. అందం, ఆనందం, దగ్గరగా వస్తే ఇంత దుర్నిరీక్ష్యాలై, దుర్భరాలై ఉంటాయని అతను ఊహించుకోలేదు. ఇప్పుడు గ్రహించి కూడా తప్పించుకోలేడు...

అతన్ని ఆ స్థితినుంచి ఐహికస్థితికి తెచ్చి కాపాడినది - కృష్ణుడి మురళి...



అది విన్నక్షణాన అతను ముగ్ధుడై పోయాడు. ఆ స్థితిలోనే మేలుకున్నాడు. తన ఊహకు అందిన దానికన్న గొప్పదీ, ఆకళింపు చేసుకుని అనుభవించడానికి సులువైనదీ అతనికి ఆనాడే వినిపించింది.

నాటి నుంచీ ప్రతి నిత్యం కృష్ణుడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్లి మురళి వినేవాడు. కొత్తల్లో కొన్నాళ్లు గోప కాంతలు కంగారు పడ్డారు. తరువాత అతన్ని ఒక గోవుగా, చెట్టుగా జమకట్టేశారు.

ఇంత మోహనమైన సంగీతాన్ని కృష్ణుడు ఒక వెదురుముక్కలో ఎలా ఇమిడ్చాడో అని గోపన్న ఆలోచించాడు. ఒకసారి అతని ఇంటికి వెళ్ళి ఆ మురళిని ఎత్తుకు వచ్చాడు. మురళిని తీసి వాయించాలనుకునేసరికి అది కనబడలేదు!

మాయదారి కృష్ణుడు గజదొంగ దగ్గర నేను దొంగతనమేమిటి అనుకున్నాడు గోపన్న.

కాని గజదొంగ ఆ సాయంత్రం కనబడి, ''గోపన్నా, నా మురళి తీసుకు పోయావు కదా... పోనీ ఇంకొకటి చేసి పెట్టు'' అన్నాడు నవ్వి.

గోపన్న తెల్లబోయాడు.

ఆ మర్నాటి నుంచి వేణు నిర్మాణం ఆరంభించాడు గోపన్న. ఆరంభించిన నాటి నుంచి అతనిలో కొత్తశక్తి, కొత్త చైతన్యం మేల్కొన్నాయి. తన చేతులలో రూపుదిద్దుకుంటున్న మురళి రేపు మాపటివేళ కృష్ణుడి హస్తాలను అలంకరిస్తుందని, ఆయన అందులోకి జీవాన్ని ప్రతిపాదిస్తాడనీ అనుదినం ఆశపడుతూ, ఆనందిస్తూ మురళిని రూపొందించాడు. ఆయన పెదిమలూనేచోట, వేళ్ళు అనేచోట మురళి కఠినంగా ఉండి నొప్పించకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాలను తన చేతులతో అరగదీశాడు.

మురళి సిద్ధం కాగానే శ్రుతి చూశాడు. గుండె బద్దలయినంత పనయింది. అది శ్రుతిశుద్ధంగా లేదు. పైగా జీర. రెండు మూడు వేణువులు పలికినట్టుంది. కృష్ణుడు ఊదుతాడన్న ఆనందంతో దానికీ ఒళ్ళు పులకరించిందా? గోపన్న అది పడేసి మరోటి చేశాడు. అదీ అంతే! మర్నాడు వెదురు చాలా తెప్పించాడు. పది పన్నెండు చేశాడు. ఒక్కొక్కటీ ఊది చూడడం, నచ్చక పారవెయ్యడం....

''నీకు వేణువు ఇవ్వనిదే నా ముఖం చూపను కృష్ణయ్యా'' అనుకున్నాడు. నాటి నుంచి ఇదే పని పెట్టుకున్నాడు. సాయంకాలం బృందావని వేపు వెళ్ళి వేణుగానం వినడం, ఉదయాస్తమానం కొత్త వేణువులు చెయ్యడం.

ఊళ్ళో వాళ్ళంతా ఇది వింతగా చెప్పుకున్నారు. కొత్తలో మెచ్చుకున్నారు. తరువాత ఆ సంగీతం పిచ్చి వదిలిందనుకుంటే, మళ్ళీ ఆ పిల్లంగోవి పిచ్చి పట్టిందిగావాల అని నవ్వుకున్నారు. తరువాత నవ్వారు.

గోపన్న పనికిరావని పడేసిన వందలాది వేణువులను కొత్తలో గొల్లపిల్లలు తీసుకుపోయే వారు. తరువాత అతనికి భయం వేసింది. వాటిలో ఏదన్నా కృష్ణయ్య దగ్గరకు పోతుందేమోనని, అందుకని చేసిన వేణువులన్నీ పాకలో అటకమీద పడేసేవాడు.

యమున ఒడ్డున గోపన్న పాక. పాక ప్రక్కనే పందిరి కింద వెదుళ్ళు. చెట్టుకింద కొలిమి చూసి ఊళ్ళో జనం హేళన చేశారు. ''గోపన్నా! ఏకంగా పెద్దకలప దుకాణం పెట్టరాదూ. వ్యాపారం చేసినట్టు ఉంటుంది'' అని...

గోపన్నకు నవ్వడానికి నవ్వుకోడానికి కూడా తీరికా, కోరికా, ఓపికా లేవు

***

పాతికేళ్ళు గడిచిపోయాయి. కృష్ణయ్య పెద్దవాడయ్యాడు. బృందావనికి రావడం లేదు. పట్నవాసం మనిషైపోయాడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. అయినా కృష్ణాష్టమి వెళ్ళిన ప్రతి నవమినాడు గోపన్న కొత్త ఉత్సాహంతో కొత్తవేణువు ఆరంభిస్తూ 'పైసారి పుట్టిన రోజుకేనా పంపాలి...' అనుకొనే వాడు పుట్టిన రోజు వచ్చేది – వెళ్ళేది.

వేణువు మాత్రం కుదిరేది కాదు. ఏమిటో ఆ జీర. ఎవరో వెక్కిరిస్తూ

న్నట్లు.... ఏదో శాపం ఉన్నట్టు...

''నాయనా బువ్వదినవే..'' అన్నాడు చిన్నగోపన్న.

తండ్రి వాడివంక చూశాడు. జాలివేసింది. తల్లిలేని బిడ్డ. తండ్రి ఉండీ లేని బిడ్డ. ఆ వయసుకి వాడే రోజూ ఇంత గంజి కాచిపెడుతున్నాడు. వాడి అచ్చటా ముచ్చటా చూసుకుంటున్నాడు. అదీ మంచిదే అయింది. రేపు అష్టమి వెళ్ళిన నవమి నాట నుంచి నాయన లేడని బెంగటిల్లుతాడన్న బెంగ లేదు. ఎవరికి వారే యమునా తీరే...

''బువ్వదింటాలే గాని రేపు కిష్టయ్య పుట్టినరోజు... నువ్వు నందయ్యగారి లోగిలికెళ్ళి ఎవరూ చూడకుండా ఇది కిష్టయ్యకిచ్చి.... మా నాయనిచ్చి రమ్మ న్నాడని చెప్పి రావాల'' అన్నాడు గోపన్న.

''బువ్వదిను మరి'' అన్నాడు బిడ్డ.

గోపన్నకి ఎందుకో వాణ్ణి చూడగానే బాలకిష్టయ్య గుర్తుకొచ్చాడు. అటూ ఇటూ బెరుగ్గా చూసి గబుక్కున వాణ్ణి దగ్గరకు లాక్కుని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు. బుల్లాడికిది కొత్త... వాడు తెల్లబోయి చూసి బుగ్గ తుడుచు కున్నాడు... ''బువ్వదిను మరి'' అన్నాడు.

''మురళి పట్టుకెళ్తావా?''

''నువ్వలాగే అంటావు. పొద్దుటేలేమో ఇది బాగులేదు. ఒద్దులే అంటావు''.

''అనను. ఈసారి చేసేది బాగుంటదిలే. అయినా సూడనుగా'' అన్నాడు గోపన్న నీరసంగా నవ్వి.

''బువ్వదిను మరి'' అన్నాడు చిన్న గోపన్న.

***

మర్నాడు ఉదయమే గోపన్న కొడుక్కి తలంటి నీళ్ళు పోశాడు. సాంబ్రాణి ధూపమేసి జుట్టు ఆరబెట్టాడు. చిక్కుదీశాడు. వదులుగా కొప్పు ముడేసి పూలు తురిమాడు. పట్టుకండువా తీసి పంచెకట్టాడు. మరోటి తీసి ధట్టీ చుట్టాడు. కస్తూరి తిలకం దిద్దాడు. కాటుక దిద్ది, దిష్టి తగలకుండా బుగ్గన చుక్క పెట్టాడు. నెమిలీకల వనంలోంచి ఒక కన్ను తీసి కొప్పున బెట్టాడు.

చిన్నగోపన్నకీవరస బొత్తిగా నచ్చలేదు. ఎన్నడూ లేని పనులు చేస్తు న్నాడు అయ్య. వాడికెందుకో గుబులేసింది. కంట నీరు తిరిగింది. జాలిగా నాయన వంక చూశాడు. ముస్తాబు ముగించిన గోపన్న తృప్తిగా ఒకసారి కొడుకును చూశాడు.

క్షణంలో నిర్విణ్ణుడై పోయాడు. ఇదేమిటి బాలకృష్ణుడు... గోపాలకృ ష్ణుడు ఇక్కడికి ఎందుకొచ్చాడు? తాను ఏనాడో ఎత్తుకొచ్చిన వేణువు కోసమా?

గోపన్న తేరిపార చూశాడు. సందేహం లేదు – కృష్ణుడే. అప్రయత్నంగా చేతులు జోడించి దండం పెట్టాడు. ఒక్కసారిగా కన్నీరు కట్టలు తెంచు కుంది. అది దుఃఖమో, ఆనందమో.

''ఏందే అయ్యా'' అంటూ వచ్చి కౌగలించుకున్నాడు కొడుకు, తండ్రి దండం పెట్టేసరికి వాడికి ప్రాణం కంగారు పెట్టేసింది.

గోపన్న ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకున్నాడు. ''దేవుడికి దండం పెట్టా నురా'' అన్నాడు. ''ఏదే మురళేదే'' అంటూ అటూ ఇటూ చూశాడు. కన బడలేదు.

''అటక మీదెట్టాను. రాతిరి ఎలకలొస్తే...'' అన్నాడు చిన్నగోపన్న భయ పడుతూ.

''ఆ! ఎంత పన్జేశావురా బాబూ...'' అన్నాడు గోపన్న ఎలకలుండేదే అటక మీద అని తెలిసి అక్కడ పెట్టటమేమిటని కేకలెయ్యబోయాడు. కాని మనస్కరించలేదు. అటక మీదకెక్కి చూశాడు. అక్కడ తను పనికిరావని పడే సిన వేణువులు గుట్టలుగా ఉన్నాయి. అందులో ఏది కొత్తది? ఏది మంచిది?

గోపన్న ఆ వేణువులన్నీ కిందికి దించాడు.

ఒక్కొక్కటీ తీసి ఊది చూడసాగాడు.

''ఇది కాదు''.


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్టమెంట్స్, చర్చ్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్: 040 - 23747777, 9391999999

FREE online Registration &
Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట్ | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఒంగోలు | ఈరోడ్
 | ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


''ఇటువేపు గుట్ట తరుగుతోంది. అటువేపుది పెరుగుతోంది. కాలం తరు గుతోంది.

మధ్యాహ్నం భోజనం వేళ వచ్చింది. గోపన్న వేణుపరీక్ష సాగిస్తూనే ఉన్నాడు.

చిన్నగోపికి తండ్రిని పలుకరించేందుకు సాహసం చాలలేదు. వాడూ అలాగే కూర్చున్నాడు. చెమటకి కస్తూరి బొట్టు కరిగిపోయింది. కాటుక చెరిగి పోయింది. పూలు వాడిపోయాయి. వాడి సంతోషం. ఉత్సాహం చెన్ను దరిగాయి. అన్నం తిననందువల్ల నీరసం కూడా కలిగింది. కాని, గోపన్న ఇవేమీ గమనించే స్థితిలో లేడు.

ఇది కాదు.

ఇదీ కాదు...

ఇన్ని వేణువుల గుట్టలో ఎక్కడో సత్యమైన కొత్తవేణువు దాగి ఉంది. అది సత్యమైనదేనా?... ఏమో... గోపన్నకి తెలియదు. పరీక్షించి చూడలేదు. అయి వుంటుందని, అయితీరాలని...

***

పొద్దు వాటారింది. చీకటి చిక్కబడింది. చిన్నగోపన్న దీపం వెలిగిం చాడు.

''నాయనా, చీకటి పడిపోతోందే, పుట్టింరోజు పండుగయి పోతోంది'' అన్నాడు జంకుతూ, గోపన్న తల ఊపాడు. ఇక రెండే రెండు వేణువులు మిగిలాయి. ఒకటి చూశాడు. ఇదీ కాదు.

ఇంక ఒక్కటి మిగిలింది. ఇదేనా... ఏమో... అతను ఉదయం నుండి వెతు కుతున్నది మంచిదికాక, కానందువల్ల ఈ గుట్టలో పడిపోయిందేమో, ఇప్పుడు మిగిలింది, ఒకప్పుడు పనికిరాదని తను పడ వేసిందేమో... చివరి

మురళిని పరీక్షించడానికి గోపన్నకి ధైర్యం చాల లేదు. సత్యం తెలుసుకొని చనిపోగల శక్తి లేదు. మళ్ళీ ఇంకో ప్రయత్నం చేసే ఓపిక లేదు. వ్యవధి లేదు.

''ఇదే'' అన్నాడు ధీమాగా.

''ఊదవా?'' అన్నాడు కుర్రాడు.

''ఒద్దు... లగెత్తు... కిష్టయ్య చేతికియ్యి, ఆయనే చూస్తాడు. ఆయనే చెబుతాడు'' అన్నాడు గోపన్న.

కుర్రాడు ఇంక ఆగలేదు. మళ్ళీ తండ్రి మనసు మారే లోపల పారిపోవాలనుకున్నాడు. చీకట్లోకి పరుగెత్తాడు.

***

పాతిక సంవత్సరాల గాలివాన వెలిసింది. గోపన్న నీరసంగా మేను వాల్చాడు. పూర్వం ఊహాసంగీత ప్రపంచంలోకి తొంగి చూసినప్పుడు కూడా ఇలాటి నిస్త్రాణే కలిగేది. ఇవాళా అదే...

తాను పని ముగించాడా.... భగవంతుడికి సరియైన శ్రుతిశుద్ధమైన వేణువును పంపాడా... ఇన్ని సంవత్సరాలు కృషి చేసి ఇన్ని వేల పరీక్షలు జరిపి, చివరికి పంపిన వేణువును పరీక్షించుకోనేలేదు. అది కృష్ణయ్యకి వదిలేశాడు. శ్రుతి సరిలేకపోతే ఆయనే సరిచేసుకొంటాడు.

అయినా శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా... సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా? గోపన్నకు నవ్వు వచ్చింది.

ఎంత పొరబాటు! పాతికేళ్ళ పొరబాటు... ఒక జీవితం పొరబాటు ఆయన అలుగుతాడా.. అలగడు, నవ్వుకుంటాడు.... వెర్రిగోపన్న అనుకొంటాడు. అనుకొని మురళిని తన పెదిమల దగ్గర ఉంచుకుంటాడు, శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి ఓంకారానికి మూల స్థానమైన నాభిలోంచి మంగళ గళంలోంచి... మధురాధరాలలోంచీ...

వెన్నా పాలూ ఆరగించిన మధురాధరాలలోంచి, రాధాధరాలను పవిత్రం చేసిన మధురాధరాలలోంచి జీవం వచ్చి తన వేణువులో ప్రవేశిస్తుంది.

తన పక్కనున్న వేణువులోంచి సన్నటి, చక్కటి స్వరం నెమ్మదిగా ఇవతలికి రావడం, వచ్చి తన చెంప నిమరడం గమనించాడు గోపన్న.

ఇదేమిటి? తను పనికిరాదనుకొన్న మురళి...

ఇంకో క్షణానికి ఆ పక్క మురళి, ఉత్తరార్థానికి ఇటు పక్క మురళి మేలుకున్నాయి. మరికొద్ది క్షణాలలో ఆ కుటీరంలోని సహస్ర వేణువులూ భువన మోహనంగా గానం చేయసాగాయి. గోపన్న లేచి కూర్చున్నాడు. భ్రమరాన్ని చూస్తున్న కీటకంలా దశదిశలా పరిభ్రమించాడు. అన్ని వేణువులూ పాడుతున్నాయి. అన్నిటిలోనూ అలనాటి బృందావన కృష్ణుడి మోహనగానమే, అన్నీ శ్రుతిశుద్ధంగా ఉన్నాయి. అసత్యమైన వేణువు లేనేలేదు. భగవంతుడికి ఉపయోగ పడని వేణువే లేదు.



గోపన్న విభ్రాంతుడైపోయాడు. నీరసంగా ఆనందంగా మేను వాల్చాడు. సహస్ర వేణునాద స్వరార్ణవంలో – సాక్షాన్మహావిష్ణువై తేలుతున్నాడు.

వేణుగానం ముగిసిన కొద్దిక్షణాలకు అంతకన్న మధురమైన అడుగుల సవ్వడి వినబడింది. చిన్న గోపన్న వచ్చి ఉండాలి. తను పంపిన మురళి మంచిదో కాదో చెప్తాడు. ఈ సత్యం ఇక తెలిసినా మానినా ఒకటే. అంతకన్న గొప్ప సత్యాన్ని దర్శించాడు గోపన్న.

గోపన్న నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. గుమ్మంలో బాలకృష్ణుడు! పట్టుపంచ పట్టుధట్టీ, కస్తూరి బొట్టు, బుగ్గన చుక్క సిగలో పింఛం...

''నువ్వే వచ్చావా కిష్టయ్యా.....'' అంటూ లేచి కూర్చుని చేతులు జోడించాడు గోపన్న.

''అయ్యా! అయ్యా! కిష్టయ్య నీ మురళి వాయించాడే నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. అయ్యా మరేం... కిష్టయ్య నీ మురళి వాయించాడే కానీ... మరే... ఎంత వాయించినా ఏమీ వినబడలే. అస్సలు పాట రాలేదే... కాని కిష్టయ్య మంచోడు, నన్నిక్కడ ముద్దెట్టు..''

గోపన్న తల పక్కకు తిప్పి గదినిండా పడి వున్న వేణువులను చూశాడు. ఇంతసేపూ గానం చేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా, సగర్వంగా చూసి – ఒకటి తీసి ముద్దు పెట్టుకున్నాడు గోపన్న!



## అత్యున్నత సోపానం

మనిషిని నిశ్చయంగా, మనసును నిర్మలంగా ఉంచేదే ఆధ్యాత్మికత. అది పరిపక్వతను సారిస్తున్న కొద్దీ పరిపూర్ణతను సాధిస్తుంది. అంతరంగంలో ఆనంద వంశీనాదాల్ని అనంతంగా శృతి చేస్తుంది. ముళ్లపూడి వెంకటరమణ రాసిన 'కానుక' కథ ఆధ్యాత్మిక సాధనలో అత్యున్నత సోపానం. ఇందులోని కథ, కథనం, శైలి, శిల్పం ప్రతీ అంశం నాకెంతో ఇష్టం.

–ఎజికె